# మ్యానరికం

ఏంతలేదన్న లక్ష్మికి పదేండ్లొచ్చెగద నిరుడు నేను బత్కమ్మ పండుగకు పోయినప్పుడే పిల్ల అంబటిపైమీద పన్నెండుఏండ్లోలె గన్పడ్డది. అవును మరి! అందుట్ల ఆరేళ్లమూడేళ్లోళ్ల ఏవరుండరని! అన్న నిలువెడు మనిషిగద! ఇగ వదినెమట్కు ఏం తక్కువదిన్నదని; తండ్రి నెయ్యిగారంగ గార్వంగ బెంచె మరి! ఆపాలే పెద్దోర్పపాలు ఏమొ! ఏం పాలోఏమొ! తల్లి గారు తల్లి గారని నాకు గొట్క పోతదిగని, ప్రాణర్తివాకం తోటి ఒక్కనాడన్న బండిదోలిందా? నన్నుదోల్కరమ్మని; ఏందో కడ్పులలేంది కాగలిచ్చుకుంటె వస్తదా? అంట! అట్లని పోకుండ ఉండెటట్ల లేకపాయె గద! చూస్త చూస్త మ్యానరికం ఎట్లవోగొట్టుకోవాలె? అందుట్ల పోరి ఏం కురూపిదా? దబ్బనిమ్మపం డపాంటిపిల్ల. తోడపుట్టినతోడు మా అన్నమాత్రం బక్కసిక్కినోడా? ఇంటిబలం వొంటిబలం గల్లోడే. గిన్ని బిర్రులు జూసుకోనే మావొదినె దొరుసాని మిర్రెక్కికూసున్నది. లేకపోతే ఆడిపిల్లలున్నోళ్లకు ఇంతబింక మేందీ అంట?

అయ్యో అట్లనినేను బిర్రువెటుకోని కదులకుండ గూసుందమంటె మా ఆడివిల్ల ముక్కిడిముక్కు సుబ్బిని ఇస్టం ఇస్తమని వాళ్ల ఆసువోసినట్లు దిర్గవట్టిరి మావోళ్లగూడ ఎంతని వోపికెపడ్తరు? నాకు నా వోళ్ల మీద ప్రాణం గొట్టుకున్నట్లు తనకు తన రక్తసమ్మందం మీద గుంజదా మరి? ఏకువోయి మేకైతే కస్టం కొమ్మైవొంగంది మానై వొంగుతదా? అన్నరు. అందుకోసం యా ముజ్జింపులులేకుండ ఇప్పుడే దేల్పుకోవాలె. రేపులేదు ఎల్లుండి పండుగ రానే వచ్చె గదా! పండుగకు వోయినట్లుంటది ఈమాట గదిలిచ్చి వాళ్ళమనుసులు దెల్పుకున్నట్లుంటది. ఇందుట్ల నా కొచ్చిన తలొంపులు యాడుండవి? అని మనుసు గుదిరిచ్చుకోని, రాత్రోరాత్రి కావలివోతున్న కర్రెన్నను మాన్పిచ్చి కొట్టంకాడ్కి దర్మింది కమలమ్మ.

"మోట్లుగొట్టెపొద్దుకే బండి మనఇంటిఎదురుగ సిపాయిలమీద ఉండాలె. పగ్గాలు, పలుపులు, మెడదుత్తలు పశులమాలెల పెద్దగుమ్మిఎన్కఉండవి. ఇప్పుడే దెచ్చి దులిపిపెట్టుకో, మరి బండికి కందెనఏసి బుర్కవెట్టాలె. తొట్లె వెట్కం మరిశేరు నాయినో! తొట్లెనిండుగ గడ్డి బాగమెత్తగనింపి, జంఖానపరువుండి, రొండుదిక్కుల మెత్తలుపెట్టుంచ్రి. బండికి పెద్దసవారిఎడ్ల గట్టకుండి. అవి మీ దొరకే పసందు. లగేసెనంటె మిర్రుపల్లంజూడకుండ ఉర్కుతవి. అందుకే నా బండికి మన రాములును, గోపాలును గట్టుండి, ఎడ్లకుగజ్జెలపట్టెళ్ళు గట్టుడుమర్వేరు. అయ్యో! నా ధ్యాసపాడుగాను! పర్దాలకు తాళ్ళుతెగినసంగతే మర్శిన, అవిట్ని గట్టిగగుట్టిత్తమన్న సోయేలేకపాయె. వాట్ని ఇప్పుడే గొంచవోయి తుర్కల గుట్టియ్యమని సిప్పసిన్నమ్మకు

ఒప్పజెప్పిరావాలె బిడ్డ! మా ఇంటి ఆడివిల్లలందరు ఎన్కట మ్యానలల్లనే రాకపోకలు చేసేటోళ్ళంట. యాదోమరి! నేను పరదాలబండ్లెనన్న ముద్దుగ వోకపోతె ఎట్ల? ఏందో నాకీ పీకులాట? గట్టుగూలంగ గంగెద్దు ఆనవట్టిందంట. పాతపడికట్లన్ని వోతుంటె, తుర్రుబుర్రు మనిబస్సులవోక ఎందుకీ ఊరుమాణం రాజీర్కమని మాదొర దీరాలుదీస్తడు. ఆయనకేంది? మస్తుజెప్పొచ్చు. తనమీద యాడ బరువు వడ్తదో అని తప్పిచ్చుకతిరుగె మాటలు! ఇంతకు గా మాత్రం సుదరాయించుకోలే ననుకున్నడో ఏందో?" అని ఇంటినిండ గున గున నడ్సుకుంట చెప్పెటోళ్ళకు పనులన్నిజెప్పింది. నాల్గుదినాల కోసం ఆడివాప రాజమ్మను వంటవార్పు జూస్కోమ్మని వొప్పగిచ్చింది.

ఎక్కడిపను లక్క డయినంక గుడ సెరిసగంరాత్రిదాంక పెద్దెక్కవెట్టుకోని, పాలుగాసి, కోవముద్దజేసి, తోషదాన్ల నింపుకున్నది. తిజోరి దెరిసి సవురకుప్పె, నాగురం, శికబిల్ల, చెంపసరాలు, పోంచీలు, బన్నసరం దీసుకోనిపెట్టుకున్నది. పెట్టెలసీర దీసికట్టుకోని, బిల్లసరాల రైక దొడిగింది. కొడ్కు తిరుపతికి సలుపజేసినఅంగి దొడిగిచ్చి తెల్లారెట్యాళ్ళకు "పోయొస్త, పదిలం ఇల్లు!" అని అనుకుంట బండెక్కి పయనమైంది.

అప్పుడే భోజనంజేసి బిడ్డలక్ష్మిని పక్కలవెట్టుకోని నడిమింట్ల ఉయ్యాలమీద గూసున్నడు కేశవయ్య. ఎక్కడివక్కడ సదురుకోని పెండ్లాం రాదమ్మగూడ వొంటింట్లకెళ్లివొచ్చి, తడిచేయి కొంగుకు తూడ్సుకొని పక్కల్నేఉన్న ఆరాంకుర్చీమీదగూసున్నది. ఇంతట్లనే మూలమల్పునబండిని అళ్ళిచ్చినసప్పుడు. ఇగ ఆ గజ్జెలబండి తమ వాకిట్లనే ఆగిన సప్పుడైంది. అది యిని కేశవయ్య 'ఎవరబ్బ! గీయాళ్ళప్పుడు గజ్జెల బండిల వచ్చింది?' అని అంటుంటే, 'ఆఁ! ఇంగెవరుంట రండి! మీ చెల్లెలుదొరుసానై ఉంటది.' అని రాదమ్మ ఆరాంకుర్చీలకెళ్ళి లేసింది. కేశవయ్య బిడ్డసెయ్యి సేతులవట్టుకోని పోయి పన్గడదెరిసిండు. నిజంగ రాదమ్మ జెప్పినట్లు చెల్లెలుకమలమ్మనే వచ్చింది.

"అరె! నీవా? కములా! అదేందే సెప్పకసెయ్యకవచ్చినవ్? బావేడి? కారటన్న రాపియ్యగూడదా? సామాను మీ వొదిన జూసుకుంటుందిలే! దిగు! అరే, తిరుపతి! ఏందిరా? మూలకునతికినవు? ఊఁ దుంకుబండి, బేటా లచ్చన్న! అగో సూడు ఎవరొచ్చిర్రో?" అనుకుంట చెల్లెల్ని బండిదింపుకున్నడు. ఇంతట్లనె పనిమనిషి చెంద్రమ్మవొచ్చి బయటిచెంబుల నీళ్ళువోసి, కాళ్ళకునీళ్ళిచ్చింది. సలువతువాల దండెంమీదేసి సబ్బువెట్టింది. ఆడివిల్ల కమలమ్మ దబదబ కాళ్ళుగడుక్కోని "అంశవంతరాలవమ్మవొదినే! సక్కనీబిడ్డను గన్నవ్. రాంగరాంగ లక్ష్మి చిల్కతీర్గ అయితుండది." అని గద్వపట్టుకొని ముద్దాడుతుంటె. "ఈ పిల్లకంత మీ సాలె వచ్చింది వొదినె నగుతె అచ్చం మ్యానత్తనే అని వాళ్ళనాయిన అంటడు" అని రాదమ్మ కలెగల్పుగమాట్లాడి, ఆడిబిడ్డకు జర్పాల్సిన మర్యాద లన్ని జరిపింది.



రాదమ్మ పట్నవాసంల పెరిగింది. బాగ సదువుకున్నది. అందుకే దసరపండుగను సాదగనె జేతమనుకున్నదిగని, ఆడివిల్ల ఊరికేలి పిలువకుండగనె తనంతట తాను తల్లిగారిల్లుసొచ్చుకొని వొచ్చినందుకు ఆయింటి సిరస్తపోనియ్యగూడదు, అబ్బో! మా కమలమ్మ ముక్కుమీద ఈగవాల్తె ముక్కుగోసేసుకొనేబంటు. ఎందుట్లగూడ ఏరుతారు రానియ్యగూడదు అని కేశవయ్య అప్పుడుగాదిప్పుడని మనిషిని దరిమి తంగెడుపువ్వ, గునుగుపువ్వ, ర్యాలెపువ్వ, బంతిపువ్వ ఇంగ అన్నిపూలు సంచులకొద్ది తెప్పిచ్చిండు బత్కమ్మను సింగారిచ్చ; రాదమ్మ అట్కుమీదికెల్లి పెద్దతాంబాళం దీపిచ్చింది. పట్కరిపరుమయ్యవొచ్చి గులాలురంగు, నీలిరంగు, చిలుకపచ్చ, బీరపచ్చరంగుల పొట్లాలుదెచ్చి, గుంతచిప్పలల్ల గలిపి దూదిపిడ్స లేసిండు. కమలమ్మ వాకిట్ల అలికి పూసినతాన బియ్యపుపిండితోటి కమలం దీర్చింది. నడింట్ల ఈత సాపలగూసోని రాదమ్మ వొక్కొగా గున్నుపూలన్నిటికి రంగులేసింది. ఇంతట్లనె కమలమ్మొచ్చి బత్కమ్మను కండ్లకుపండుగయ్యేటట్లు పేర్చింది. పిల్లలిద్దరు త్యాప కింత కోవముద్ద దినుకుంట ఆటలవడి(న్రు.

ఒప్పులకుప్పోలె అలంకారంజేసి పసుపుకుంకుమల్తోటి పూజిచ్చిన బత్కమ్మను జూసి కేశవయ్య "రాదా! చూడె, మా చెల్లెమ్మ చేతుల ఎంతపనితనం ఉందో?" అని మెచ్చుకుంటుంటె, ముసిముసి నగులు నగుకుంట కమలమ్మ "ఊకో అన్న! వొదినె అల్కపాన్పుఏసిగిట్ట!...." అంటె, రాదమ్మ కొంటెకొమ్మతీర్గ కేశవయ్య మొకంలకు జూసి "అయ్యో! ఎవ్వరిపెరటిపువ్వ వాళ్ళకు వాసనగాదామరి? ఎవ్వరి ఎచ్చులువాళ్ళవి" అని అంటుంటె అందరు గలగల నవ్వుకున్నరు.

ఇంగ బోజినాలయినంక తీరువాటంగ కమలమ్మ గూసోని, లక్ష్మిని విల్సి ముందలగూసోవెట్టుకొని, రొండుజడలిడ్సి ఎంటికలు పాపిపాపి ఊదునూనె మెరుగువెట్టింది. ఒంటిజడేసింది. పూలగొట్టంతోటి జడనిండ పూలుగుచ్చింది. చెవులకు గున్నాలువెట్టింది. చేతులకు కాకరకాయగొలుసులు వెట్టింది. మొకానికి పోడరుఏసింది. కాట్కె కడకొల్కులు దాటంగ దిద్ది, సాదుసుక్క వెట్టింది. ఇట్ల పిల్లను తీర్చినబొమ్మోలె జేసి కమలమ్మ కొడలిగదువ చేతులకు దీస్కొని 'నా పండు! చంద్రదీపం!' అని ముద్దిచ్చుకొని, "ఇట్లజర్గే" అని, "తిరుపతి, నీ వింగ రాబిడ్డ!" అని తిరుపతిని విల్సి ముంగల గూసోవెట్టుకున్నది. ఇప్పుడు తిరుపతికిగూడ ఎంకటేశ్వర్లమొక్కు కొరకుంచిన' ఎంటికలు పెద్దగయినవి. తిరుపతికిగూడ లక్ష్మికి మెరుగువెట్టినట్లే ముందలగూసోవెట్టుకొని నూనెవెట్టి దువ్వి జెడేసింది. కొనాకు ఎట్టిఉలనుగట్టింది. సలువజేసిన లాగు దొడ్గి దానిమీద ఎర్రబనారసుపూలకోటు దొడిగింది. మెళ్ళ అసిలివెట్టింది. చేతులకు

బంగారుముర్గులు వెట్టింది. బొమ్మలసందున సన్నగ సాదుసుక్కవెట్టింది. ఇట్లా తయారుజేసిన తిరుపతిని జూసి లక్ష్మి నగుకుంట ఇంట్లకు ఉరికి "అమ్మా! బావ బావగాడే, ఆడిపిల్లనే. నాకంటె పొడుగు జెడేసుకున్నడు. పూలపూల అంగిదొడుక్కున్నడు" అని చెప్పుతుంటె, "లక్ష్మి, అట్లనొద్దమ్మ బావను. అత్త పండుగనాడు కొడ్కుకు ఎన్కటిపోషాకు దొడ్గి తీరొక్కతీరున సూసుకుంద మని అట్ల సోకుజేసింది. నాకు గూడ మొన్నమొన్నటిదన్క కాలుకు బేడి, చెవులకు పోగులు, కొన్కెపోగు ఉండె. మీయమ్మ బయానికి దీసిన." అని కేశవయ్య అంటుంటె, రాదమ్మ "అయ్యో నా బయమెందుకొచ్చె నడుంగల? ఇప్పుడు మునిగిపోయిందేముండది కలం దాండ్లకేలి దీసి మళ్ళవెట్టుకో రాదుండి, సూడసక్కనుంటది ఏశం" అని అన్నది.

ఇంతట్లకె కొడుకును సింగారిచ్చి దిష్టిదగుల్తదని మిటికిళ్ళిరిసి అరికాలిదుమ్ముదీసి ఎవ్వరుజూడకుండ దబ్బున పొట్టకు రాసి "నా తండ్రి కృష్ణమూర్త్యోలె ఉండడు. ఇప్పుడడ్గుత మీ మామను, అత్తను, ఏమంటరో?" అని పక్కకు మళ్ళి "పిల్లా, లక్ష్మి, యెక్కడవోతివే! అరే తిర్పతి పో బిడ్డ, నీ పెండ్లాన్ని విలుసుకరా పో," అని అన్నది కమలమ్మ. ఇగ రాదమ్మ ఈ మాటయిని మొకం చిట్లిచ్చుకొని "వొదినే, అవేంమాటలమ్మ? ఆ పిల్లలు జానెడులేరు; జిట్టెడులేరు. అప్పుడే, పెద్దోళ్ళం మనం మొగడు పెండ్లాం అని నేర్పితె రేపు ఎవరి అదృష్టం ఎట్లుంటదొ, ఎవరికి ఎక్కడ ప్రాప్తెం ఉంటదో, ఏమొ ఎవరికెర్క, మీకు కోపంవచ్చినా సరే, నా బిడ్డను మాత్రం అట్లపిలువకుండి" అని అన్నది. తల్లి ఈమాటలంటుంటె పిల్ల అవేం ఇనిపిచ్చుకోకుండ 'అమ్మా! సూడే నేను అవద్దం జెప్పితె బావ ఆడిపిల్లనే, ఆ జడజూడమ్మా' అని సప్పట్లుగొట్టుకుంట ఎగిరింది.

రాదమ్మ మాటలు ఇన్న కమలమ్మకు ఎక్కడలేని రోసంముంచుకొచ్చి "అయ్యో! మా టనంగనె మీ కంతకష్టమైనా దుర్ల. ఈసారి ఈ సమందం పండోకాయో తేల్చుకపోదామని వొచ్చినగని పండుగపూటల్ల నాయిల్లు ఇడ్చి నీయింట్ల బక్షాలు, లడ్డూలు దినేటందుకురాలేదు. మ్యానపిలగాడు ఉండంగ పరాయోడు పిల్ల నడిగే టందుకు ఎట్లొస్తడో జూస్త. వచ్చే టోడువొస్తె ఇచ్చేటోడెట్ల ఇస్తడోగుడజూస్త. కొంగువర్సుకోని కడపలల్ల పండుకుంట. నామీదకెళ్లి దాటుకుంట పిల్లనుగొంచవోవాలె ఏమనుకున్నరో మరి? నిండుపండుగ నాడు నీయింటికొస్తె కండ్లకద్దుకొని పిల్లసమందం గట్టిజేస్తరనుకున్న. నా కొడ్కు నూగ్గాడోలె పెర్గుతుండె. వాణికేమి కన్నొంకర్నా? కాలొంకర్నా? వాళ్ళతండ్రికేం తక్కువ అనా? బలుగంలేనోడా? బలంలేనోడా? యాదో! నేను నావోళ్ళని మిడ్కి నీ యిల్లుజొచ్చుకొచ్చి మా అంతట్లమేము బైటవడిపల్చనైనం ఆడిపెద్దిర్కం తంబళ్ళదొరతనం అని మొగోళ్ళను మిగమీరొచ్చి ఇప్పుడు నగటోళ్ల ముందల జారిపడ్డట్టైతి. ఒక్క గడియసేపు నిలువను. నా కొడ్కు మీకండ్ల కానంది మీ యింట్ల నేనెందుకు? అమ్మవోయిన్నాడె అంతమునిగింది. ఇంతటితోటి తెగదెంపులు, నీకడ్ప నేనుదొక్కను, పోత' ', అని రుస్సుబుస్సుమనుకుంట వోయి -

"తిరుపతి! యాడున్నవుపోరగా, రా రా!" అని పిలుస్తుంటె, పిల్లగాడెమొ బిరబిరవోయి తల్లేసినజడ గత్తరిచ్చుకోని, ఇంటెన్క మల్లెవందిరికింద గద్దె మీదగాసోని జెడకొనాకుగట్టినడులనుతోటి లక్ష్మి వాడు ఏళ్ళవాలఆట ఆడుకుంటగూసున్నరు. అట్ల గూసున్నవాణ్ణి జూసెట్యాళ్ళకు కమలమ్మకు కడుపుమసిల్నట్లైంది. కొడ్కును అమాంతం గుంజుకోని, ఎదకద్దుకోని, "ఇదేందిబిడ్డ! దేవుని మొక్కుబడిగద కొడ్కా? నీ కెందుకంత నాదానివొచ్చె నాయినా? ఆపోరి నీడ నీమీద వడొద్దు. ఇదే గట్టైతె ఇంగేం అయితుండెనో! ఏందో! ఈసారిసె కే రావద్దు మనం. పా! బిడ్డ, మనూరికి" అని లేపుతుంటె, "అమ్మ, నేనురానే, ఈణ్ణేఉండి సదువుకుంటనే. అత్తదగ్గర్నే ఉంటనే." అని అంటున్నకొడ్కును గుంజుకపోతుంటె, లక్ష్మి ఏడ్సుకుంటొచ్చి, "అత్తా, నేనొస్త నీఎంబడి బావనుజూసి నగను, జుట్టు గత్తరియ్యను ఆడిపిల్ల అనను. నీ వేమన్నగని మా యమ్మకుజెప్పను బావ నన్ను పెండ్లాంఅనే పిలువని, నన్ను దోల్కపో బావదగ్గర్నే ఉంట" అని నడుంబట్టుకొని యాళ్లాడింది.

ఇదిజూసి కేశవయ్య "ఏంది కములమ్మా ఇది? చూడుతల్లీ! ఈ పూటకు ఉండు. పసిపిల్లలు దేవుండ్లసుంటోళ్ళు. నిదానంజేయి. అంత తామసంవొద్దు" అని గదువవట్టుకొని అడుక్కుంటుంటె, రాదమ్మ "వొదినె, పట్టుఇడువుండి. దేవునిదయ రేపు ఎట్లా జరగాల్నని వుంటే అట్లా జరిగితీర్తది. మనమెవ్వరం ముడేసెటందుకు, ఇడ్సెటందుకు?" అని దండంబెట్టింది.

ఇగ ముగ్గురు కండ్లు దుడ్సుకుంట పిల్లలసేతులు వట్టుకొని ఇంట్లకునడ్సిన్రు.

*(1973లో ప్రచురించిన 'మా ఊరి ముచ్చట్లు'*
*కథాసంపుటి నుంచి....)*